

మానేపల్లిలో జగనన్న లేఅవుట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు.
పునాదులకే పరిమితమైన పేదల నివాసగృహాలు



జగనన్నా... దారిచూపవయ్యా!

» దారి లేని లే-అవుట్‌కు రిజిస్ట్రేషనా! » పునాదుల్లోనే శిథిలమవుతున్న నిర్మాణ పనులు » మానేపల్లిలోని జగనన్న లే-అవుట్ వద్ద లబ్ధిదారుల నిరసన

పి.గన్నవరం, ఫిబ్రవరి 15: జగనన్నా ఇంటి స్థల ఇచ్చావు... కానీ ఆ స్థలంలోకి వెళ్లడానికి దారిలేదు... .దారి చూపవయ్యా అంటూ దీనంగా అర్థిస్తున్నారు మానేపల్లి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు. మాకు కాలనీలోకి వెళ్లడానికి దారిచూపాలని కోరుతూ మానేపల్లి శివారు జానగట్టులో నిరసన వ్యక్తం చేసి దారి ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. స్థలం కేటాయించి సుమారు మూడేళ్లు కావస్తోందని, కొంతమంది నిర్మాణాలు కూడా చేపట్టారని వారు తెలిపారు. ఇప్పటి వరకు అధికారులు తమరే దారి చూపలేదని వారు ఆరోపించారు.

మానేపల్లి జానగట్టు వద్ద 3.09 ఎకరాల్లో 101 మందికి జగనన్న ఇళ్లు కోసం స్థలాలు కేటాయించారన్నారు. మేరక పనులు, రోడ్లు పూర్తయిన తరువాత రోడ్లు వేశారని, లబ్ధిదారుల్లో ఐదుగురు ఇంటి నిర్మాణం కూడా చేపట్టారు. అయితే లే-అవుట్‌కు ముందుభాగంలో ఉన్న వ్యక్తి (జిరాయితీ భూమి కలిగిన వారు)కి అధికారుల మధ్య నష్టపరిహారం విషయంలో తలెత్తిన వివాదంతో సంబంధిత వ్యక్తి దారి మూసేశాడన్నారు. అప్పటి నుంచీ నిర్మాణాలు పునాది దశలోనే ఆగిపోయాయి. నిర్మాణం కోసం తెచ్చుకున్న ఇనుము, కంకర, ఇసుక సైతం మట్టిలో కలిసిపోతున్నాయన్నారు. ఇదే విషయమై కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, స్థానిక పంచాయితీలోను అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందన్నారు. అధికారులు సమస్యను పరిష్కరించకపోవడంతో కాలనీకి దారిలేకుండా పోయిందని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జగనన్న ఇళ్ల స్థలాలకు దారి చూపించాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో షేక్ అబ్బాస్‌వలి, ఎస్‌కే మీరావలి, బండారి తాతయ్య, పోలవరపు నాగేశ్వరరావు, బండారి మసేను, గాడా దుర్గ, గాడా లక్ష్మి, బండారి వెంకటలక్ష్మి, సత్యవతి, మహలక్ష్మి, మంగాయమ్మ, దార్లంక దుర్గబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.



దారిలేని ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లా: పోలవరపు నాగేశ్వరరావు

ముందు ఇళ్లు నిర్మించుకోండి తరువాత రుణాలు మంజూరు చేస్తామని చెప్పడంతో అప్పులు చేసి మరి నిర్మాణాలు చేపట్టాం. తీరా చూస్తే ఇప్పుడు దారి మూసేశారు సామగ్రిని ఎలా తెచ్చుకోవాలి. పునాదులు చూస్తే శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. అప్పులు చూస్తే వడ్డీలు పెరుగుపోతున్నాయి. దారిలేని స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేసుకుని వాటిని ఏం చేసుకోవాలి. అధికారులు స్పందించి మాకు దారి చూపాలి.

ఇంటి నిర్మాణానికి తెచ్చుకున్న సామగ్రి మట్టిలో కలిసిపోతోంది: షేక్ మీరావలీ



జగనన్న లే-అవుట్‌లో సెంటున్నర స్థలం కేటాయించారు. దీంతో త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులు తొందరపెడితే పనులు చేపట్టాం. తీరా చూస్తే ఇప్పుడుదారి విషయంలో వచ్చిన వివాదంతో దారి కాస్తా మూతపడింది. నిర్మాణం ముందుకు సాగకపోవడంతో తెచ్చుకున్న సామగ్రి మట్టిలో కలిసిపోతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి స్థల వివాదాన్ని పరిష్కరించి స్థలాలకు దారిచూపాలి.



నేటి నుంచి అంతర్వేది కల్యాణోత్సవాలు

అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధమైంది. శుక్రవారం రథసప్తమి పర్వదినాన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. శుక్రవారం నుంచి పది రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. విద్యుత్ వెలుగుల్లో ఆలయాన్ని పై చిత్రంలో చూడొచ్చు.

వివరాలు 7లో



రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన రావులపాలెం విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టు (పైన)ముక్తేశ్వరం విద్యార్థి రూపొందించిన ప్రాజెక్టు (కింద)



రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఏడు ప్రాజెక్టులు ఎంపిక

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌మనాక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లా నుంచి ఏడు ప్రాజెక్టులు ఎంపికైనట్టు జిల్లా విద్యా శాఖాధికారిణి ఎం.కమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ హైస్కూలు విద్యార్థి నక్కా సత్యప్రవీణ్ రూపొందించిన ప్లాంట్‌గ్రోయింగ్ మెషీన్, టీకె ఎస్‌జేవీ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి వడ్లమూడి సూర్యచైతన్యకిరణ్ రూపొందించిన బాస్కెట్ అలారం ఫర్ అపార్టుమెంట్స్, రావులపాలెం జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి వెలగల చైతన్యసాయి కృష్ణారెడ్డి రూపొందించిన ఇండికేటర్ ఫర్ సైక్లోనిక్ గేల్స్, ఊబలంక జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పడమటి ప్రభుకుమార్ రూపొందించిన బ్యాంకు సేఫ్టీ అండ్ సెక్యూరిటీ సిస్టమ్ విత్ వాయిస్ అలెర్ట్ అండ్ కాల్ అలెర్ట్ టూ పోలీసు స్టేషన్ త్రూ జీఎస్ఎం ప్రాజెక్టు, సిరిపల్లి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బండి మోహనవెంకటేష్ రూపొందించిన వాటర్ పంపు వితౌట్ పవర్ సప్లయి ప్రాజెక్టు, రాజోలు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి దీపాటి కమల్‌తేజ్ రూపొందించిన ఆటోమేటెడ్ వెహికల్ పార్కింగ్ సిస్టమ్ యూజింగ్ స్మార్ట్ కార్డు ప్రాజెక్టు, గోడిలంక జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి బొడ్డు ఓక్షిత్ రాజేష్ రూపొందించిన ట్రావెలింగ్ బ్యాగ్ విత్ ఫోల్డబుల్ సీట్స్ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. రాష్ట్ర స్థాయి పోటీలు ముందుగా నిర్ణయించినట్టు అయితే ఈ నెల 18న జరగాల్సి ఉంది. రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల ఆదేశాలను అనుసరించి త్వరలోనే తేదీతో పాటు ప్రాంతాన్ని ఖరారు చేయాల్సి ఉందన్నారు. చిత్తూరులో రాష్ట్రస్థాయి పోటీలు జరిగే అవకాశం ఉందని జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు.



చొప్పెల్ల, మూలస్థానం గోదావరి లంక భూములలో రాత్రి సమయంలో జరిపిన తవ్వకాల దృశ్యాలు

లంక మట్టి... కొల్లగొట్టి!

చొప్పెల్ల, మూలస్థానం లంక భూముల్లో రాత్రివేళలో జోరుగా తవ్వకాలు

ఆలమూరు, ఫిబ్రవరి 15: చీకటి పడితే చాలు వారు లంక భూముల్లోకి చొచ్చుకొస్తారు. లంక మట్టిని ఇష్టానుసారం తవ్వేస్తారు. సదరు నిర్వాహకులకు అండదండలు మెండుగానే ఉండడంతో మట్టి రవాణా యథేచ్ఛగా సాగిపోతోంది. ఆలమూరు మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో గత పదిహేను, ఇరవై రోజులుగా లంక మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా చొప్పెల్ల, మూలస్థానం అగ్రహారం గ్రామాల పరిధిలోని లంక భూముల్లో ఈ తవ్వకాలు సాగుతున్నాయి. ఎవరైనా వెళ్లి ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నట్టు సమాచారం. రాత్రి పది గంటలు మొదలుకొని ఉదయం ఐదు గంటల వరకు ఈ తవ్వకాలు సాగుతున్నాయని స్థానికులు చెప్తున్నారు. ఎంతో శ్రేష్ఠమైన లంక మట్టిని నమ్ముకుని అన్ని రకాల కూరగాయలు, పూల తోటలు సాగుచేసుకుని జీవించే రైతుల పాలిట మట్టి అక్రమ తవ్వకాలు శాపంగా మారాయి. సాగు చేస్తున్న పొలాల పక్కనే యంత్రాలతో తవ్వకాలు చేస్తుండడంతో గోదావరి వరదల సమయంలో తమ భూముల్లో మట్టి కొట్టుకుపోయి వచ్చే ఏడాది సాగుకు పనికి రాకుండా పోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఆలమూరు, కడియం ప్రాంతాల్లోని ఇటుక బట్టీలు, నర్సరీలకు లంక మట్టిని బాగా వినియోగిస్తారు. పోలీసుల అండదండలతో మట్టి తవ్వకాలు అడ్డూఅదుపూ లేకుండా జరుగుతున్నాయి.



విత్తనాలవారి కాల్వగట్టు ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటును నిరసిస్తూ మహిళల ఆందోళన

అక్కడ తీసేసి.. మళ్లీ ఇక్కడ పెడతారా!

ప్రభుత్వ మద్యం షాపు ఏర్పాటుపై మహిళల నిరసన... షాపు ఏర్పాటుకు తీసుకువచ్చిన మద్యం వెనక్కి

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: మహిళల నిరసనకు తోడు టీడీపీ, జనసేన నాయకులు సంఘీభావంగా ఆందోళనకు దిగడంతో శ్రీరామపురంలోని నివాస గృహాల మధ్య ఉన్న ప్రభుత్వ దుకాణాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ తీసివేసి మరోచోటుకు ప్రభుత్వ మద్యం దుకాణాన్ని గురువారం తరలించేందుకు ఎక్సైజ్ అధికారులు పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీరామపురం నుంచి విత్తనాలవారి కాల్వ గట్టు ప్రాంతంలో నివాస గృహాల మధ్యలో ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు సరుకు తీసుకువచ్చారు. సమాచారం తెలుసుకున్న మహిళలు మద్యం సరుకును వాహనం నుంచి దించకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే ఆందోళనకు దిగారు. వారికి ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి తదితరులు సంఘీభావం తెలిపారు. నివాస గృహాల మధ్యలో మద్యం షాపు ఎలా ఏర్పాటు చేస్తారని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక పెద్దలతో పాటు ఎక్సైజ్ అధికారులు జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మద్యం సరుకును తరలించకపోతే ధ్వంసం చేసేందుకు మహిళలు సిద్ధపడ్డారు. పోలీసులు రంగప్రవేశం చేశారు. పరిస్థితిని గుర్తించిన ఎక్సైజ్, పోలీసు అధికారులు మద్యం షాపును అక్కడ ఏర్పాటు చేయమని, మరోచోటకు మద్యం షాపును తరలిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. దాంతో మహిళలు ఆందోళన విరమించారు. ప్రభుత్వ మద్యం దుకాణం ఏర్పాటు కోసం తీసుకువచ్చిన సరుకును అక్కడి నుంచి ఎక్సైజ్ అధికారులు తరలించుకువెళ్లిపోయారు. ఏదైనా రాత్రి సమయంలో తిరిగి అదే ప్రాంతంలో మద్యం షాపు ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని మహిళలు హెచ్చరించారు. నిరసనలో కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి, మహిళా నాయకులు భవానీ, విశాలాక్షి, సరోజిని, బాలామణి తదితరులు పాల్గొన్నారు.



షాపు ఏర్పాటు కోసం తీసుకువచ్చిన మద్యాన్ని వెనక్కి తీసుకుపోతున్న అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

'పనితీరు మారకపోతే కఠిన చర్యలు'

ముమ్మిడివరం, ఫిబ్రవరి 15: మండల విద్యా శాఖ అధికారుల పనితీరుపైనే విద్యా ప్రగతి ఆధారపడి ఉంటుందని, ఎవరి స్థాయిలో వారు పనితీరును మెరుగుపరుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని పాఠశాల విద్యా శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి హెచ్చరించారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.కమలకుమారి అధ్యక్షతన గురువారం ఎంఈవోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయడంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. పాఠశాలలో నిర్వహించే అసెంబ్లీ సమావేశానికి ముందే పాఠశాలలకు చేరుకోవాలన్నారు. పాఠశాలల తనిఖీ సమయంలో అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పెరిగే విధంగా ఉపాధ్యాయులు గుణాత్మక విద్యనందించే చర్యలు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపాధ్యాయుల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. తనిఖీ అధికారులు పాఠశాలల్లో 3, 4, 5 తరగతులకు అమలవుతున్న ప్రోగ్రాంలను పరిశీలించి నివేదికను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డిజిటల్ టెక్నాలజీని విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా నిత్యం పర్యవేక్షణ చేయాలన్నారు. మార్చి 18 నుంచి ప్రారంభమయ్యే పది పరీక్షలకు విద్యార్థులను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయాలన్నారు. ఎంఈవోలు వారి పరిధిలోని పాఠశాలలను పరిశీలించి వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ముమ్మిడివరం ఎంఈవో కార్యాలయాన్ని మిగతా కార్యాలయాలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎంఈవో కార్యాలయాల్లో రికార్డులన్నీ అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. ఎంఈవోలు, హెచ్ఎంలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, అమలాపురం డీవైఈవో శ్రీపాద నరసింహ ఫణి, సీనియర్ ఎంఈవో బొజ్జా రమణశ్రీ, సమగ్ర శిక్షా కార్యాలయ ఫైనాన్స్, అకౌంట్స్ ఆఫీసర్ జి.ప్రవీణ్‌కుమార్, డీఈవో కార్యాలయ ఏడీలు నక్కా సురేష్, విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారులు డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, ఎంపీకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ, ఏపీవో బి.ఆదినారాయణ, ఏఎస్‌వో డి.తాతారావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

మొండివైఖరి వీడకపోతే మూల్యం చెల్లించక తప్పదు

ప్రభుత్వానికి జేఏసీ నాయకుల హెచ్చరిక

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి విడనాడకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఏపీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారంలో భాగంగా ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజైన గురువారం అమలాపురం తహసీల్దారు కార్యాలయప్రాంగణంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. జేఏసీ చైర్మన్ రాజశేఖర్, కన్వీనర్ పట్టాభిరామయ్య, ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మురుగేశ్వరరావు, ఫ్యాప్టో చైర్మన్ నాగిరెడ్డి శివప్రసాద్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు బకాయిపడ్డ సొమ్మును వెంటనే విడుదల చేయాలని, 12వ పీఆర్సీ విధి విధానాలు విడుదల చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేసారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో జరిగిన నిరసనలో జేఏసీ ప్రతినిధులు పృథ్వి, మురళీ, బ్రహ్మాజీ, శ్రీనివాస్, చంద్రరావు, చంద్రకళ, బసవేశ్వరరావు, యెల్లేశ్వరరావు, ఈశ్వరరావు, ఎంఎస్ఎన్ మూర్తి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్వేది ఉత్సవాలు

పది రోజుల పాటు వైభవంగా ఉత్సవాల పర్వం

సర్వం సిద్ధం చేసిన అధికారులు

వివిధ వాహన సేవలకు ఏర్పాట్లు



అంతర్వేది, ఫిబ్రవరి 15: అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వార్షిక కల్యాణోత్సవాలు 16వ తేదీ శుక్రవారం రథసప్తమి పర్వదినాన ప్రారంభంకానున్నాయి. శుక్రవారం నుంచి పది రోజుల పాటు స్వామివారి కల్యాణ మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా అంతర్వేది చెరువులో హంసవాహనంపై స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

అంతర్వేదికి మార్గం:

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి అంతర్వేది చేరుకునే భక్తులు రావులపాలెం, రాజోలు మీదుగా రావాల్సి ఉంటుంది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చే భక్తులు పాలకొల్లు, దిండి-చించినాడ వంతెన మీదుగా శివకోడు, మలికిపురం మీదుగా రావచ్చు.

పెంచిన ఆర్టీసీ బస్సులు:

లక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణోత్సవాల సందర్భంగా ఆర్టీసీ అమలాపురం, రాజోలు, రాజమహేంద్రవరం, కాకినాడ, భీమవరం, పాలకొల్లు డిపోల నుంచి 120 ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అదే విధంగా గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అదనపు బస్సులను కల్యాణోత్సవాలకు సిద్ధం చేశామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

అంతర్వేది చేరుకోవాలంటే..

అంతర్వేదికి రాజోలు నుంచి 31 కిలోమీటర్లు, రాజమహేంద్రవరం నుంచి 104, అమలాపురం నుంచి 63, కాకినాడ నుంచి 118 కిలోమీటర్లు, పాలకొల్లు నుంచి 41 కిలోమీటర్లు, భీమవరం నుంచి 64 కిలోమీటర్లు.

నేటి వాహన సేవలు

కల్యాణోత్సవాల్లో తొలిరోజైన శుక్రవారం రథసప్తమినాడు స్వామివారికి సూర్యవాహనంపై ఊరేగింపు జరుగుతుంది. సూర్యుడు వెలుగునిచ్చే జ్ఞాన ప్రదాత. మనుషుల్లో అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానం అనే వెలుగును నింపేందుకు కోటి సూర్యప్రభా సమేతుడైన శ్రీలక్ష్మీనరసింహస్వామి సాయంత్రం 4.30గంటలకు సూర్య ప్రభా వాహనంపై గ్రామ మాడ వీధుల్లో ఊరేగుతారు. ముద్రికా లంకరణ అనంతరం స్వామివారు రాత్రి 8 గంటలకు చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతారు.



స్వామివారి రథం

నేడు స్వామివారు పెండ్లికొడుకాయనే

కేశవదాసుపాలెం వాస్తవ్యులు బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులు సంయుక్త నిర్వహణలో శుక్రవారం ఉదయం నుంచి అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తారు. బెల్లంకొండ, ఉండపల్లి వారి కుటుంబీకులచే స్వామివారికి మధుపర్కములు సమర్పించి శుక్రవారం సాయంత్రం 6.30కు స్వామివారిని పెండ్లికుమారుడు, అమ్మవారిని పెండ్లి కుమార్తెను చేస్తారు. లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

సునామీపై మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న దృశ్యం

యానాం, ఫిబ్రవరి 15: సునామీ వస్తే ప్రభుత్వ యంత్రాంగం ఎలా అప్రమత్తమవ్వాలి, ముంపు ప్రాంతాల ప్రజలను ఎలా రక్షించాలనే అంశంపై పుదుచ్చేరి డిజాస్టర్ మేనేజ్‌మెంట్ శాఖ ఉత్తర్వులు మేరకు యానాంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. స్థానిక రాజీవ్‌నగర్, దరియాతిప్ప ఏటిగట్టు మార్గంలోని ఏవీఆర్ కెమికల్స్ పరిశ్రమ, రాజీవ్ రివర్ బీచ్, జెట్టి తదితర ప్రాంతాల్లో ఈ డ్రిల్ నిర్వహించారు. తొలుత అధికారులు సైరన్లు మోగించుకుంటూ సునామీ హెచ్చరికలు చేశారు. స్థానిక ఇందిరా గాంధీ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి రక్షణ చర్యలను పరిపాలనాధికారి మునిస్వామి, ఇతర శాఖల అధికారులు పర్యవేక్షించారు. పలు పాఠశాలలు, ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు, పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు దండాయుధపాణి, విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజానగరానికి చెందిన మందవిల్లి వెంకటేశ్వరరావు-కాశీఅన్నపూర్ణ దంపతులు రూ.5,05,116 విరాళం సమర్పించారు. వారికి ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో బి.కిశోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, మన్యం భాను పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా గురువారం ఒక్కరోజు ఆదాయం రూ.1,63,990 లభించినట్టు ఈవో తెలిపారు.

భీమేశ్వరుని హుండీ ఆదాయం రూ.15.77 లక్షలు

ద్రాక్షారామ, ఫిబ్రవరి15: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారికి హుండీ ద్వారా రూ.15,77,588 ఆదాయం సమకూరింది. గురువారం స్వామి వారి హుండీలను దేవదాయశాఖ తనిఖీదారు బాలాజీరామ్ ప్రసాద్ పర్యవేక్షణలో ఈవో పి.టి.వి సత్యనారాయణ, సిబ్బంది హుండీలను తెరిచి లెక్కించారు. 2023 డిసెంబరు 14 నుంచి గురువారం వరకు ఈ ఆదాయం లభించినట్లు ఈవో పి.టి.వి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో వాడ్రేవు సుందర రత్నాకరరావు, కంచర్ల చక్రి, సేవకులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి తాటిపర్తిలో నాటక పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 15: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో మార్కండేయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి 17వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు జరగనున్నాయి. అపర్ణా కళాతోరణం బత్తుల మురళీకృష్ణా కళా వేదికపై 16,17,18వ తేదీల్లో ఈ పోటీలను నిర్వహించనున్నారు. తొలి రోజు శుక్రవారం గుంటూరు అమరావతి ఆర్ట్స్ కళాకారులు అమృతహస్తం నాటికను, విజయవాడ కళానిలయం కళాకారులు బంధం నాటికను ప్రదర్శిస్తారు. 17వ తేదీన గుంటూరు అభినయ ఆర్ట్స్ కళాకారులు ఇంద్రప్రస్థం, కొలకలూరు సాయి ఆర్ట్స్ కళాకారులు కౌసల్య సుప్రజ రామా, అమలాపురం రసవాహిని కళాకారులు స్వీకారం నాటికలను, 18వ తేదీన తాడేపల్లి అరవింద ఆర్ట్స్ కళాకారులు స్వర్గానికి వంతెన, కొప్పోలు పండు క్రియేషన్స్ కళాకారులు పక్కింటి మొగుడు నాటికలు ప్రదర్శించనున్నారు. కళాభిమానులు ఈ నాటికలను తిలకించేందుకు రావాలని మార్కండేయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు పడాల రవి కోరారు.

20న జనార్ధనస్వామి రథోత్సవం

ధవళేశ్వరం, ఫిబ్రవరి 15: పురాణ ప్రసిద్ధిగాంచిన జనార్ధన స్వామి రథోత్సవం, కల్యాణోత్సవాలను ఐదు రోజులపాటు నిర్వహించడానికి ఆలయాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకూ నిర్వహించే రథోత్సవానికి ఆలయ ప్రాంగణాన్ని రంగులతో తీర్చిదిద్దుతున్నారు. మెట్ల మార్గం నుంచి రామపాదాల రేవు వరకు చలువ పందిళ్లు వేస్తున్నారు. రథసప్తమి సందర్భంగా రథానికి ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పువైపునకు తిప్పి సిద్ధం చేస్తారు. రథోత్సవం సందర్భంగా పోలీస్‌స్టేషన్ సమీపంలోని ముఖ ద్వారాన్ని అగస్తేశ్వర ఆలయ చైర్మన్ పందెళ్ళ భానుప్రసాద్ ఆధ్వర్యంలో అందంగా తీర్చిదిద్ది ఆలయ పేర్లతో అలంకరించారు.

అనుమానం పెనుభూతమై..

భార్యను హతమార్చిన భర్త

ఆపై తానూ పురుగుమందు తాగి ఆత్మహత్య

రోడ్డున పడ్డ చిన్నారులు

కడియపుసావరంలో విషాదం



కడియం, ఫిబ్రవరి 15: భార్యపై అనుమానం.. ఓ కుటుంబాన్ని చిందర వందర చేసింది. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెను హతమార్చాడు.. ఆపై తానూ పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. క్షణికావేశంలో జరిగిన ఈ ఘటనతో పిల్లలు అనాథలుగా మిగిలారు. కడియం మండలం కడియపుసావరం గ్రామంలోని వడ్డి వీరభద్రరావు కాలనీకి చెందిన దూళ్ళ సూరిబాబు(40)కు, అదే గ్రామానికి చెందిన సత్యశ్రీ(33)కి 16 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఎనిమిదో తరగతి చదువుతున్న కుమారుడు వెంకన్నబాబు, ఐదో తరగతి చదువుతున్న కుమార్తె వైష్ణవిశ్రీ ఉన్నారు. సూరిబాబు కౌలు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరు గతంలో వడ్డి వీరభద్రరావు కాలనీలో ఉండేవారు. ఇటీవల పంచాయతీ కార్యాలయం సమీపంలో సత్యశ్రీ తల్లిదండ్రుల ఇంటి వద్ద ఉంటున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న సూరిబాబు గురువారం ఉదయం భార్యతో గొడవపడి క్షణికావేశంలో పీకను పదునైన వస్తువుతో కోసాడు. దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్, కడియం సీఐ బి.తులసీధర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సత్యశ్రీ మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారంగా వివరాలు సేకరిస్తున్నారు. క్షణికావేశంలో చేసిన తప్పుకు మనస్తాపం చెందిన సూరిబాబు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలియడంతో బంధువులు, గ్రామస్థులు రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సూరిబాబు సాయంత్రం మృతి చెందాడు. భార్యాభర్తల మృతితో పిల్లలిద్దరూ అనాథలుగా మిగిలారు.

పోలీసులకు ఫిర్యాదు

ఈ ఘటనపై కొవ్వూరులో ఉంటున్న సత్యశ్రీ సోదరి సంతోషి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమ తల్లిదండ్రులకు తాము ఐదుగురు సంతానమని, ఏడాది క్రితం తల్లి చనిపోయిందని తెలిపింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగకు సత్యశ్రీ ఎవరితోనో ఫోనులో మాట్లాడుతున్నట్టు సూరిబాబు తమకు చెప్పాడని, దీంతో పెద్దల సమక్షంలో వారికి నచ్చచెప్పినట్టు చెప్పింది. సత్యశ్రీని బావ పలు మార్లు వేధించాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈనెల 14న సావరం గ్రామ పెద్దలు వచ్చి అక్కబావలకు సర్ది చెప్పారని తెలిపింది. ఈనెల 15వ తేదీ ఉదయం 6 గంటల సమయంలో తమ పుట్టింటిలో అద్దెకు ఉండే వాళ్లు సమాచారం ఇవ్వడంతో వచ్చామని, అప్పటికే సత్యశ్రీ(33) రక్తపు మడుగులో ఉందని, పీకపై లోతుగా తెగిన గాయం ఉందని, మొక్కల గ్రాఫ్టింగ్‌కు వాడే బ్లేడ్‌తో దాడిచేసి ఉండొచ్చని సంతోషి ఫిర్యాదులో పేర్కొంది.



సూరిబాబు, సత్యశ్రీ కుటుంబం

చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు

నలుగురు బైక్ దొంగల అరెస్టు

17 వాహనాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

రామచంద్రపురం, ఫిబ్రవరి 15: చెడు వ్యసనాలకు బానిసలై మోటారు సైకిళ్లను చాకచక్యంగా దొంగిలిస్తున్న నలుగురు బైక్ దొంగలను అరెస్టు చేసి వారి నుంచి 10 స్కూటీలు, 7 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ తెలిపారు. రామచంద్రపురం పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో చర్చి కాం పౌండ్ వద్ద బైక్ దొంగతనం జరిగిందన్న ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టి పలు ప్రాంతాలలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న నలుగురిని అరెస్టు చేశామన్నారు. వారిని విచారించగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రాంతాలలో అలాగే యానాం పరిధిలో 17 వాహనాలను దొంగిలించినట్లు తెలిపారన్నారు. అరెస్టైన వారిలో రామచంద్రపురం సాయినగర్‌కు చెందిన సలాది ఉదయ్ సాయి సుధీర్, పెమ్మిరెడ్డి బాలవెంకట్, కుమ్మర్లవీధికి చెందిన అమలదాసు నాగబాబు, మండపేట మండలం చిన్న ద్వారపూడి గ్రామానికి చెందిన కొప్పిశెట్టి దిలీప్ ఉన్నారన్నారు. చెడు వ్యసనాలకు బానిసలైన వారు సులువుగా డబ్బులు సంపాదించడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నారన్నారు. తాళం వేసి ఉన్న మోటారు బైక్ వైర్లను కలిపి స్టార్ట్ చేసి దొంగిలిస్తున్నట్లు నిందితులు తెలిపారని చెప్పారు. పట్టణంలో ఎవరైనా ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు పోలీసు స్టేషన్‌కు ముందస్తు సమాచారం అందజేస్తే వారి ఇళ్లకు భద్రత కల్పిస్తామని చెప్పారు. కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ దొరరాజును, ఎస్‌ఐ కె.సురేష్‌బాబు, హెడ్ కానిస్టేబుల్ కె.వీరబాబు, ఎస్.ఈశ్వర్‌రావు, కానిస్టేబుల్స్ టి. సూరిబాబు, ఇ.అనిల్ కుమార్, పోలయ్య, కె.లోవరాజును డీఎస్పీ రామకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం నిర్లక్ష్యం

వైసీపీ హయాంలో 150 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారు

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్



నరేందర్‌కి జ్ఞాపికను అందిస్తున్న సర్పంచ్‌లు

అంబాజీపేట, ఫిబ్రవరి 15: దేశానికే పట్టుకొమ్ములుగా ఉన్న గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చాంబర్ గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ అన్నారు. టీడీపీ హయాంలో సర్పంచ్ చేసిన పనులకు నిధులు మంజూరు చేయకుండా అడ్డువేయడంతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని చెప్పారు. మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రజలకు అన్ని కష్టాలే అని అన్నారు. వలంటీరీ వ్యవస్థను సీఎం జగన్ ఏర్పాటు చేసి పంచాయతీలను నిర్వీర్యం చేశారన్నారు. టీడీపీ హయాంలో ఎస్సీఎస్టీ, బీసీ సర్పంచ్‌లు కోట్లాది రూపాయలు వెచ్చించి గ్రామాల అభివృద్ధికి అనేక నిధులు ఖర్చుచేశారని, వాటిని ఈ ప్రభుత్వం వచ్చాక మంజూరు చేయకుండా ఆ సర్పంచ్‌లను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దీంతో రాష్ట్రంలో ఉన్న సుమారు 150 మందికి పైగా సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. సర్పంచ్‌ల హక్కుల సాధన కోసం దేశవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభించేందుకు ఏపీ ఛాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో త్వరలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను జగన్ ఛిన్నాభిన్నం చేశారన్నారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు జమచేసిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను జగన్ ప్రభుత్వం దొంగలించిందని ఆరోపించారు. ఆర్థిక సంఘం నిధులు తిరిగి పంచాయతీలకు జమ చేసే విధంగా కోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాష్ట్రంలో సుమారు 60 శాతం పైగా ఎస్సీఎస్టీ, బీసీ సర్పంచ్‌లు ఉన్నారని, వారిలో పొట్టకూటి కోసం కొందరు కూలి పనికి కూడా వెళుతున్నారన్నారు.సర్పంచ్‌లకు పంచాయతీల ద్వారా రూ.15 వేల నుంచి 20వేలకు పైగా గౌరవ వేతనం తీసుకునే విధంగా ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీ సర్పంచ్‌ల చాంబర్ కార్యదర్శి జల్లి బాలరాజు, సర్పంచ్‌లు చిక్కం జంగమయ్య (పెదబాబు), పెద్దిరెడ్డి రాము, అడబాల తాతకాపు, కుంపట్ల ఆదిలక్ష్మి నాయకులు కొప్పిసీడి ఈశ్వరరావు ఉన్నారు.

తిరుమల విద్యాసంస్థల నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న తిరుమలరావు

తుని రూరల్, ఫిబ్రవరి 15: తిరుమల విద్యా సంస్థలు రాజమహేంద్రవరం వారి నూతన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసును గురువారం పాయకరావుపేట మెయిన్ రోడ్డులో గల డీసీసీ బ్యాంక్‌పై తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విలువలతో కూడిన విద్యను అందరికీ అందించాలనే సదుద్దేశ్యంతో తిరుమల విద్యాసంస్థను నెలకొల్పామన్నారు. పాయకరావుపేట, తుని చుట్టుపక్కల గల పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు కోరిన మేరకు పాయకరావుపేట పీఎల్‌పురం సెంటర్ హైవే పక్కన తమ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ క్యాంపస్ ఎల్‌కేజీ నుంచి తొమ్మిదో తరగతి, జూనియర్ ఇంటర్ డే స్కాలర్‌గా ప్రారంభించామన్నారు. పాయకరావుపేట, తుని, అన్నవరం చుట్టుపక్కల గ్రామాలకు బస్సు సౌకర్యం ఉందని, అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని చెప్పారు. అడ్మిషన్లు, ఇతర వివరాలు కోసం 80084 78777, 85209 26777 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకాడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ యు.శ్రీహరి, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇంటర్ విద్యార్థి దుర్మరణం



మండపేట, ఫిబ్రవరి 15: మండపేట తాపేశ్వరం కెనాల్ రోడ్డులో గురువారం మధ్యాహ్నం లారీ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇంటర్ విద్యార్థి మృతిచెందాడు. పట్టణ అదనపు ఎస్‌ఐ నాంచారయ్య తెలిపిన వివరాలు ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన పడాల అఖిల్ మణికంఠ ఆదిత్య కళాశాలలో జూనియర్ ఇంటర్ ఎంపీసీ చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం కాలేజీ నుంచి మండపేట తాపేశ్వరం వైపు బైక్‌పై వెళ్తుండగా తాపేశ్వరం నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో అఖిల్ అక్కడికక్కడే చనిపోయాడు. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, అర్బన్, రూరల్ సీఐలు అఖిల్‌జమా, శ్రీధర్‌కుమార్‌తో పాటు పట్టణ ఎస్‌ఐ హరికోటి సంఘటనా స్థలానికి పరిశీలించారు. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లిన అఖిల్ ప్రమాదవశాత్తు మరణించటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. అఖిల్ మరణంతో సహచర విద్యార్థులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పట్టణ అదనపు ఎస్‌ఐ నాంచారయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో చుక్కల జింక మృతి

రాజవొమ్మంగి ఫిబ్రవరి 15: రాజవొమ్మంగి మండలం అప్పలరాజుపేట గ్రామ శివారు అటవీ ప్రాంతం నుంచి కుక్కల దాడి కారణంగా జనవాసంలోకి వచ్చిన చుక్కల జింక గురువారం మృతి చెందింది. బుధవారం గాయాలతో చుక్కల జింక అప్పలరాజుపేట గ్రామంలోకి రావడం గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ అధికారుల ఆధీనంలో ఉన్న చుక్కల జింక గురువారం మృతి చెందడంతో అటవీ శాఖ సబ్ డీఎఫ్‌వో శ్రీరామరావు ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయం సమీపంలో చుక్కల జింకకు పోస్టు మార్టం నిర్వహించి దహనం చేశారు.

ఎన్నికల విధులకు సన్నద్ధం కావాలి

ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్



మొక్క అందిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు అన్ని విధాలా సన్నద్ధం కావాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరగడానికి అందరూ సమష్టిగా పూర్తి సమన్వయంతో పని చేయాలని.. సర్వీసులో రిమార్కు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయం (డీపీవో)లో గురువారం ఆయన వార్షిక తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు. వివిధ విభాగాల వార్షిక పనితీరు, జిల్లాలోని పరిస్థితులను ఆయనకు ఎస్పీ జగదీశ్ వివరించారు. అనంతరం డీపీవో ప్రాంగణంలో ఉన్న ఆయుధాగారం, డాగ్ స్క్వాడ్, బీడీ టీం, ఎంటీవో, ఆర్‌ఐ స్టోర్స్‌ని డీఐజీ సందర్శించారు. మినిస్టీరియల్, డీసీఆర్బీ, డీటీఆర్బీ, ఎస్‌బీ తదితర విభాగాలు సమర్పించిన వార్షిక పనితీరు నివేదికలను పరిశీలించారు. కమాండ్ కంట్రోల్‌లోని సీసీ కెమెరాల లైవ్ స్ట్రీమింగ్‌ని వీక్షించారు. ఎన్నికల దృష్ట్యా డీపీవో నుంచి సకాలంలో ఎన్నికలకు సంబంధించిన సమాచారం రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి, ఉన్నతాధికారులకు చేరే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఆ మేరకు పోలీస్‌స్టేషను స్థాయి నుంచి సమాచార సేకరణ, క్రోడీకరణపై సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగిన సమయంలో పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీడ్రిల్, వెపన్ డ్రిల్, మాబ్ డ్రిల్‌ని సాధన చేయాలన్నారు. మద్యం, గంజాయి, సారా అక్రమ రవాణా నియంత్రించాలన్నారు. సిబ్బందికి జిల్లా స్థాయిలో పరిష్కారం కాకుండా ఉన్న సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తొలుతగా ఏఆర్ అడిషనల్ ఎస్పీ చెంచిరెడ్డి ఆధ్వర్యంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పరేడ్ కమాండర్‌గా సాయుధ రిజర్వు పోలీసు సిబ్బంది చేసిన కవాతును డీఐజీ వీక్షించి గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(శాంతి భద్రతలు) పి.అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 15: రేషన్ డీలర్స్ సమస్యల పరిష్కారానికే భరోసా యాత్ర చేస్తున్నామని రేషన్ డీలర్స్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు అన్నారు. భరోసా యాత్ర రాజమహేంద్రవరం చేరుకున్న సందర్భంగా హోటల్ జగదీశ్వరిలో గురువారం సాయంత్రం జరిగిన రేషన్ డీలర్స్ సమావేశంలో మాట్లాడారు. ఆహార భద్రత చట్టం పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిబంధనలను అనుసరించి రేషన్ డీలర్స్ ద్వారా మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, తెలంగాణ మాదిరి డీలర్స్‌కి గౌరవ వేతనం కల్పించాలన్నారు.రేషన్ డీలర్స్, ఎండీయూ ఆపరేటర్లకు చెల్లించాల్సిన బకాయిలు ఈనెల 25వ తేదీలోపు చెల్లించాలన్నారు. రేషన్ డీలర్స్ అసోసియేషన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా జామి కృష్ణ, గౌరవ అధ్యక్షుడిగా బి.నారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేవీవీ రమణ, ఉపాధ్యక్షులుగా మంగం రామారావు (పెరవలి), వెంకటేశ్వరరావు (ఉంద్రాజవరం), ప్రధాన కార్యదర్శిగా వై.వెంకటరత్నం, కార్యదర్శిగా కె.కామేశ్వరరావు (కడియం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా రంగా (నిడదవోలు)ను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడపా రమణ, రాష్ట్ర కోశాధికారి రాజులపాటి గంగాధర్ గౌడ్, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జామి కృష్ణ, పల్లయ్య, గొర్రెల సత్తిబాబు, అన్ని మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

తొమ్మిది మంది గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవోలుగా పదోన్నతి

అల్లవరం, ఫిబ్రవరి 15: మండలంలోని తొమ్మిది మంది గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవోలుగా ఉద్యోగోన్నతి లభించిందని ఎంపీడీవో కృష్ణమోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జీవో 11 ద్వారా ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇందులో మొగళ్ళమూరు, గోడితిప్ప, యెంట్రుకోన, ఎస్.పల్లిపాలెం, దేవగుప్తం, తాడికోన, గుండెపూడి, బోడసకుర్రు గ్రేడ్-5 కార్యదర్శులు ఉన్నారు.

సిద్ధివినాయక ఆలయంలో పెన్నులు పంపిణీ



అయినవిల్లి సిద్ధి వినాయక ఆలయంలో పెన్నులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అయినవిల్లి, ఫిబ్రవరి 15: అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో స్వామివారి చెంతన ఉంచి పూజలు నిర్వహించిన పెన్నులను గురువారం పంపిణీ చేశారు. గణపతిపూజ, సూర్య నమస్కారాలు, పూర్ణాహుతి, మంత్రపుష్పం, దీక్షా విరమణ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిసాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ సిబ్బంది సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ముదునూరి సత్యనారాయణరాజు, దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి గొల్లపల్లి జన్మదినం



మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, లూథియమ్మ దంపతులకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

రాజోలు, ఫిబ్రవరి 15: తాటిపాకలో మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు జన్మదినోత్సవాన్ని రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజోలు నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీ నాయకులతోపాటు అమలాపురం, పి.గన్నవరం, కొత్తపేట, ముమ్మిడివరం నియోజకవర్గాల నుంచి మాజీ మంత్రి గొల్లపల్లి అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని గజమాలవేసి దుశ్శాలువా కప్పి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్‌ను గొల్లపల్లి కట్‌చేసి కార్యకర్తలు, నాయకులకు పంచారు. కార్యక్రమంలో యువ నాయకుడు గొల్లపల్లి శ్రీధర్‌బాబు, బొంతు రాజేశ్వరరావు, రాజోలు ఎంపీపీ కేతా శ్రీను, అడబాల సాయిబాబు, మంగెన భూదేవి, బందెల పద్మ, కాండ్రేగుల భవానీ, మట్టపర్తి లక్ష్మి, మేడిచర్ల సత్యవాణి, సాగి పాపయ్యరాజు, చెల్లి అశోక్, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, ఈలి శ్రీనివాస్, రాపాక నవరత్నం, సూరిశెట్టి శ్రీనివాస్, గాలిదేవర వెంకన్నబాబు, జంపన సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు కాంపిటేటివ్ పుస్తకాల అందజేత

మండపేట, ఫిబ్రవరి 15 : విద్యార్థులు పోటీ ప్రపంచంలో కష్టపడి చదివినపుడే అనుకున్న విజయం సాధ్యమని అందుకు కాంపిటేటివ్ పుస్తకాలు దోహదపడతాయని కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యుడు సత్యచారిటబుల్ సంస్థ ట్రస్టీ టీడీపీ నేత డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు. మండలంలోని మారేడుబాక ప్రభుత్వ కళాశాలకు డాక్టర్ వెంకటరమణ రూ.50వేలు విలువ చేసే కాంపిటేటివ్ జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ఆయన కళాశాల ప్రిన్సిపాల్ కె.టీ.టీ.వి శ్రీనివాస్‌రావుకు బుధవారం అందజేశారు. పుస్తకాలు అందించిన డాక్టర్ కాదాకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మలి రెడ్డి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఫణీంద్ర, మలిరెడ్డి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు అందజేస్తున్న టీడీపీ నేత డాక్టర్ వెంకటరమణ



కె.గంగవరం: పామర్రులో జరిగిన బీసీ సదస్సులో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం



బీమనపల్లిలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీలో పాల్గొన్న ఆనందరావు



మండపేట: శిలాఫలకంలో పేర్లుపై ప్రోటోకాల్ పాటించలేదని ఫొటోలు చూపుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

బీసీలకు వెన్నుముకగా నిలిచిన టీడీపీ

●రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం

కె.గంగవరం, ఫిబ్రవరి 15: బీసీలకు రాజ్యాధికారం ఇప్పించడంలోను, వారిని ఆర్థికంగా ఆదుకోవడానికి ఆదరణ వంటి సంక్షేమ పథకాలు అమలుచేసిన తెలుగు దేశంపార్టీ బీసీలకు వెన్నుముకగా నిలిచిందని రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారంరాత్రి పామర్రులో జయహో బీసీ సదస్సును నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం బీసీలను ఏవిధంగా మోసం చేసిందో వివరించారు. రామచంద్రపురం మున్సిపల్ మాజీ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం కోత పెట్టిందని చెప్పారు. సత్యాస్కాన్ అధినేత కాదా వెంకటరమణ, పెంకే సాంబశివరావు, మేడిశెట్టి ఇజ్రాయిల్ తదితరులు మాట్లాడుతూ తెలుగు దేశంపార్టీ స్థాపించిన తరువాతనే బీసీలకు రాజ్యాధికారం వచ్చిందని, చంద్రబాబు మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేశారని వివరించారు. ఈ సభలో నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు, బీసీ నాయకులు వాసంశెట్టి నాగేంద్ర, వనుం చంటి, పితాని భద్రరావు, కాసాని శ్రీను, సలాది రమేష్, వెంటూరు వీర్రాఘవులు చౌదరి, చిట్టూరి సుబ్రహ్మణ్యం, మరివాడ సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పలువురు టీడీపీలో చేరిక

మండలంలోని కోటిపల్లి గ్రామంలో పలువురు వైసీపీ కార్యకర్తలు గురువారం తెలుగుదేశంపార్టీలో చేరారు. ఇటీవల పార్టీలో చేరిన పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను) పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

నేత్రశిబిరం: కోటిపల్లి గ్రామంలో గురువారం తెలుగు దేశం పార్టీ నాయ కుడు రేవు శ్రీను ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. లయిన్స్ క్లబ్ కాకినాడవారి సౌజన్యంతో స్థానిక పైడా వారి సత్రంలో శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి శస్త్రచికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, ఉపసర్పంచ్ తమ్మా చిన్న తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోకాళ్లపై నిలబెట్టిన ఘనుడు ఎమ్మెల్సీ తోట

●మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 15: ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు దళితులంటే ద్వేషమని దళితులను మోకాళ్లపై నిలబెట్టిన ఘనుడు ఎమ్మెల్సీ తోటని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆరోపించారు. మండపేట పట్టణ టీడీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రోటోకాల్ విషయంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తు చేస్తున్న ఎమ్మెల్సీతోట తీరుపై వేగుళ్ల మండిపడ్డారు. టిడ్కో గృహాల సముదాయం ప్రారంభోత్సవంరోజున తనకు అధ్యక్ష స్థానం ఇవ్వాల్సి ఉండగా, ప్రోటోకాల్‌ను ఉల్లంఘించి శిలాఫలకంపై తనపేరును సభాధ్యక్ష స్థానం ఉండాల్సింది పోయి దానికి విరుద్ధంగా చేశారన్నారు. అదేవిధంగా బుధవారం జరిగిన టిడ్కో గృహాల లబ్ధిదారులకు పంపిణీ సమయంలో సభా ధ్యక్షురాలుగా చైర్‌పర్సన్ పేరు ఏర్పాటు చేశారని దీనిపై తాను నిలదిస్తే తాను సభను అడ్డుకునే ప్రయత్నం చేశానంటూ ఆరోపించటం సిగ్గుచేటన్నారు. సమావేశంలో పార్టీనేతలు మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, జొన్నపల్లి సూర్యారావు, చింతపలూడిసత్తిబాబు, నగరి బాపనయ్య మచ్చా నాగు, శేషపల్లి నాగు, నరిగిరి బాపనయ్య పాల్గొన్నారు

వైసీపీ పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధం

రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రాష్ట్రాన్ని వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్‌గా చేసి టీడీపీ, జనసేన పార్టీలకు పట్టం కట్టి రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారన్నారు. ఏడిదలో గురువారం ఏడోరోజు బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటింటా పర్యటించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నేతలు కోలుపోటి బాబు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వాదా ప్రసాదరావు, పాలచర్ల శిరీష, కూల్‌హోమ్ శ్రీను, జనసేన టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి మంచిరోజులు రాబోతున్నాయి

● మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల

ఉప్పలగుప్తం: రాష్ట్రానికి త్వరలో మంచిరోజులు రాబోతున్నాయని అమలాపురం మాజీ ఎమ్మెల్యే అయితాబత్తులు ఆనందరావు అన్నారు. ఉప్పలగుప్తం మండలం బీమనపల్లిలో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ఆనందరావు ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆరిగెల నానాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ నిమ్మకాల సూర్యనా రాయణ, మాజీ జడ్పీటీసీ దేశంశెట్టి, వెంకటలక్ష్మీనారాయణ, సర్పంచ్‌లు నల్లాబాం డి, చిక్కం జంగమయ్య, గొలకోటిచిన్న, ఉలిశెట్టి దొరబాబు, గుత్తుల నాగేశ్వరావు, అకేటి పెద్ద, రవణం మధు, మంచెం బుజ్జి, కంకటాల రాము మధుర ప్రతాప్, పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 15: ముమ్మిడివరం మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని ఆర్జేడీ జి.నాగమణి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యాశాఖాధికారి కార్యాలయ నిర్వహణకు సంబంధించిన అన్ని రికార్డులను ఆమె పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన జగనన్న విద్యాకానుక, జగనన్న గోరుముద్ద, మనబడి-నాడునేడు తదితర పథకాలకు సంబంధించిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. ఆయా పథకాల అమలు తీరును ఆమె పరిశీలించారు. ఎంఈవోలు బొజ్జా రమణ, ఆర్.ఉదయభాస్కర్, కార్యాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం భవిత పాఠశాలను ఆమె సందర్శించి అక్కడున్న విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠశాలలో జరుగుతున్న పలు కార్యక్రమాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి విద్యార్థుల ప్రగతిని ప్రశ్నించగా పాఠశాలకు ఫిజియోథెరపిస్టు కావాలని వారు కోరగా డీఈవో ఎం.కమలకుమారికి సూచనలిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ట్యాబ్‌లు, రూటర్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో డీఈవో ఎం.కమలకుమారి, ఎంఈవోలు పాల్గొన్నారు.

'ప్రతిపక్షాలను అణగదొక్కేందుకు కక్ష సాధింపు'



సమావేశంలో మాట్లాడుతున్న పితాని బాలకృష్ణ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 15: ప్రతిపక్షాలను అణగదొక్కడానికి సీఎం జగన్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని వాటిని తిరిగి అనుభవించేందుకు జగన్మోహన్ రెడ్డి సిద్ధంగా ఉండాలని జనసేన పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు పితాని బాలకృష్ణ పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. 10 కిలోమీటర్ల ప్రయాణానికి హెలికాప్టర్‌ను ఉపయోగించే జగన్మోహన్‌రెడ్డి పవన్‌కళ్యాణ్ ఉభయగోదావరి జిల్లాల పర్యటనలో హెలికాప్టర్ ల్యాండింగ్‌కు అనుమతించకపోవడం దారుణమన్నారు. త్వరలోనే తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సానబోయిన వీరభద్రరావు, దూడల స్వామి, పితాని రాజు, జక్కంశెట్టి పండులతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 15: గ్రామ, వార్డు, సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, హెల్త్‌కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విలేజ్ వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం డీఎంఅండ్ హెచ్‌వో దుర్గారావుదొరకు వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలో గ్రామ, వార్డు, సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, హెల్త్ కార్యదర్శులంతా ముమ్మిడివరం జిల్లా వైద్యశాఖ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రాన్ని అందించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, హెల్త్ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్యాడ్లు, పెన్నుల పంపిణీ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 15: నవభారతి గ్రామీణ అభివృద్ధి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో పది, ఇంటర్మీడియట్ విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ముమ్మిడివరం జడ్పీ బాలుర హైస్కూలులో 86 మంది విద్యార్థులకు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 102 విద్యార్థినులకు, ఎంజీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 22 మంది విద్యార్థులకు గురువారం పంపిణీ చేశారు. ట్రస్టు ఫౌండర్, చైర్మన్ అంగడి రేవతి వీటిని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు ఉన్నారు.

19న గజమాల యాత్ర

అల్లవరం, ఫిబ్రవరి 15: పేరూరు వై.జంక్షన్ నుంచి అంతర్వేది వరకు ఈనెల 19న జరిగే అగ్నికుల క్షత్రియ మహా గజమాల యాత్రను విజయవంతం చేయాలని వ్యవస్థాపకుడు చింతా మహానాగరాజు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, సంఘ పెద్దలు కోరారు. తమకు సహకరించాలని మంత్రి విశ్వరూప్‌కు వినతిపత్రం అందించారు. గజమాలయాత్రలో వేలాదిగా పాల్గొనాలని కొల్లు గౌతమ్‌బాబు, ధర్మ, తిరుమాని ఆచార్య, కొల్లు రాము, లక్ష్మణ్, వెంకటరమణ కోరారు.

ర్యాలి కేశవస్వామి ఆలయంలో విదేశీయులు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15: పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహినీకేశవస్వామిని గురువారం అమెరికాలోని వాషింగ్టన్ నగరానికి చెందిన దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఈవో కృష్ణచైతన్య స్వామి వారి చిత్రపటం అందజేశారు. అన్నప్రసాద ట్రస్టుకు కొత్తపేటకు చెందిన బ్రహ్మారాజు అమ్మాజమ్మ దంపతులు రూ.20,232, రాజమహేంద్రవరానికి చెందిన పీవీ రామచంద్రమూర్తి దంపతులు రూ.10,116 విరాళం సమర్పించారని ఈవో చెప్పారు.

జేఈఈ మెయిన్స్‌లో జాహ్నవి ప్రతిభ



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అమలాపురం ప్రభుత్వబాలికల జూనియర్ కళాశాల విద్యార్థిని గుర్రం జాహ్నవి 82.608 పర్సంటైల్ సాధించింది. ఆమెను ప్రిన్సిపల్ కవల కోటిలింగం ప్రత్యేకంగా అభినందించారు.

నల్లచెరువు మీదుగా ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం

అయినవిల్లి, ఫిబ్రవరి 15: ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని కల్పించేందుకు అయినవిల్లి మండల పరిధిలోని నేదునూరులో రావులపాలెం వెళ్లే ఆర్టీసీ బస్సును మంత్రి పినిపే విశ్వరూప్ గురువారం ప్రారంభించారు. అమలాపురం నుంచి నల్లచెరువు, నేదునూరు, ముక్కామల మీదుగా రావులపాలెం వరకు ఈ బస్సు సర్వీసును ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ వేటుకూరి వెంకట్రాజు, సొసైటీ చైర్మన్ జోగి బాబ్జి, కనుమూరి అబ్బాయిరాజు, కడలి భూపతి, జంగా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాను అడ్డుకున్న అధికారులు



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: పట్టణంలోని శ్రీలలితా థియేటర్‌లో గురువారం విడుదలైన రాజధాని ఫైల్స్ సినిమాను హైకోర్టు ఆదేశాలతో పోలీసు, రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అప్పటికే సినిమాను వీక్షిస్తున్న ప్రేక్షకులు అధికారుల తీరును తప్పుబట్టారు.నిరుత్సాహంతో వెనుదిరిగారు. పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, డిప్యూటీ తహసీల్దారు అడపా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రూ.10లక్షల భీమా చెక్కు అందజేత

అల్లవరం, ఫిబ్రవరి 15: ప్రమాద సమయాల్లో ఇండియా పోస్టు పేమెంట్ బ్యాంకు భీమా ఖాతాదారుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తుందని ఎంపీ చింతా అనురాధ అన్నారు. ఇటీవల విద్యుత్ ప్రమాదంలో మరణించిన ఉర్రింక రామసత్యశ్రీనివాస్ తల్లి మంగతాయారుకు రూ.10 లక్షల భీమా చెక్కును మొగళ్లమూరులో గురువారం అందజేశారు. ఎంపీ ఓఎస్ సీహెచ్ శ్రీనివాసరావు, ఐపీపీబీ మేనేజరు రాజకుమార్, అమలాపురం సబ్ డివిజన్ మెయిల్ ఓవర్‌సీస్ బసవా అనిల్, టాటా ఏఐజీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ఆలమూరు మండల సమావేశం

ఆలమూరు, ఫిబ్రవరి 15: ఆలమూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన గురువారం సాదాసీదాగా ముగిసింది. పది గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా కోరం లేక రెండు గంటలు ఆలస్యంగా మొదలైంది. మండలంలోని పలు గ్రామాల్లో మంచినీటి పథకం పనులను అసంపూర్తిగా వదిలేశారని, దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని సర్పంచ్ గుణ్ణం రాంబాబుతో పాటు పలువురు సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లను పగులకొట్టి పైపులైన్లు వేయడంతో రోడ్ల నిర్వహణ పంచాయతీలకు భారంగా మారిందన్నారు. అనంతరం పలు శాఖల అధికారులతో చర్చించారు. ఎంపీడీవో మేరీరోజ్, తహసీల్దారు గోపాలకృష్ణ, ఏఎంసీ చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవానీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి బీజేపీ ప్రజాపోరు యాత్ర

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: ఈ నెల 20 నుంచి 29 వరకు బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్ర నిర్వహిస్తున్నట్టు గోదావరి జోన్ క్లస్టర్ ఇన్‌చార్జి భూపతిరాజు శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు అధ్యక్షతన గురువారం పార్లమెంటు ఎన్నికల కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు శ్రీనివాసవర్మతో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీ వేమా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు, నాయకులు ప్రజలతో మమేకమై పార్టీ సభ్యత్వాలు అందించే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించాలన్నారు. పోరు యాత్ర జిల్లా కన్వీనర్‌గా యిళ్ల వెంకటేశ్వరరావు, సహ కన్వీనర్లుగా బొంతు శివాజీ, చీకురుమెల్లి శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్లుగా దూరి రాజేష్, నండూరి శ్రీరామ్, జంపన బుచ్చిరాజు, గ్రంధి నానాజీ, బి.అజయ్‌వర్మ, మట్టా సూరిబాబులను నియమించారు. నాయకులు పాలూరి సత్యానందం, ఆకుమర్తి బేబీరాణి, రాజేశ్వరి, మూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై ఎస్‌బీఐ అవగాహన సదస్సు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆత్రేయపురంశాఖ ఆధ్వర్యంలో నాబార్డు సహకారంతో వాడపల్లి, లొల్ల, ఉచ్చిలి, కట్టుంగ గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సులు నిర్వహించారు. కళాకారులు, మెజీషియన్లు పలు ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్‌బీఐ మేనేజరు ప్రవీణ్‌కుమార్ బ్యాంకు లావాదేవీలు, బీమా సౌకర్యాలపై అవగాహన కల్పించారు.

25న ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: అమలాపురంలో ఈ నెల 25న పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్-2024 పోటీలతో పాటు కోనసీమ పవర్ లిఫ్టింగ్ టీమ్ ఎంపికలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యెనుముల కృష్ణపద్మరాజు, వంటెద్దు వెంకన్నాయుడు తెలిపారు. మెన్, ఉమెన్ విభాగాల్లో అమలాపురం డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు ఆరోగ్య ఉద్యానవనంలో అమలాపురం హెల్త్-ఫిట్‌నెస్ జిమ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. 12 విభాగాలుగా పోటీలు నిర్వహించి ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతితోపాటు మెడల్, మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. స్ట్రాంగ్‌మెన్, స్ట్రాంగ్ ఉమెన్‌లకు విన్నర్, రన్నర్ ట్రోఫీలతోపాటు నగదు పురస్కారాలు అందిస్తామన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, ఫిబ్రవరి 15: మండలంలోని కండ్రిగ శివారు అల్లపల్లివారిపాలేనికి చెందిన అల్లపల్లి వీరన్న కూలిపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ నిమిత్తం చాలా వరకు అప్పులు చేశాడు. తీర్చలేని పరిస్థితుల్లో మనస్తాపం చెంది గురువారం పురుగుల మందు తాగాడు. అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

గంజా షార్ట్ ఫిల్మ్ షూటింగ్ ప్రారంభం

అంతర్వేది, ఫిబ్రవరి 15: బీవీ క్రియేషన్స్ బ్యానరుపై నిర్మించే షార్ట్‌ఫిల్మ్ సఖినేటిపల్లి కనకదుర్గమ్మ ఆలయంవద్ద ప్రారంభించారు. యువత డ్రగ్స్‌కు ఎలా బానిస అవుతున్నారనే కాన్సెప్ట్‌తో ఈ షార్ట్ ఫిల్మ్ నిర్మిస్తున్నట్టు దర్శకుడు కడలి వంశీ తెలిపారు. ముహూర్తపు షాట్‌ను నాయుడు దుర్గారావు ప్రారంభించగా నిర్మాత బంగారు వెంకట్రావు, కెమెరామెన్ హరి, సంగీతం సింధూ కె.ప్రసాద్‌లు వ్యవహరిస్తున్నారన్నారు. నటీనటులుగా మోరం నాయుడు, హేమ, సుధ, జీవన్, లాస్య తదితరులు ఉన్నారు.

బ్రాహ్మణ సంఘం అదనపు భవనం నిర్మాణానికి భూమిపూజ

మండపేట, ఫిబ్రవరి 15: మండపేట పట్టణంలోని ధర్మగుండం చెరువువద్ద ఉన్న శ్రీరామాబ్రహ్మణసత్రంలో రూ.25లక్షలతో నిర్మించే అదనపు భవనం నిర్మాణాలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పేరి కామేశ్వరరావు భూమిపూజ చేశారు. భవనాలకు నిధులు మంజూరుచేయించిన ఎమ్మెల్సీ తోటకు బ్రాహ్మన సంఘం తరపున పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, కోఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, కౌన్సిలర్ శెట్టికళ్యాణి, బ్రాహ్మణ సంఘ సభ్యులు, దంటూ సూర్యనారాయణమూర్తి, ఏడిద సూర్యనారాయణమూర్తి, కె.భాస్కరకామరాజు, శివకోటి శేషసుబ్రహ్మణ్యం, అయ్యగారి విశ్వేశ్వరరావు, అవసరాల వీర్రాజు, విద్యాసాగర్, భగవాన్ మాష్టారు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి

కొత్తపేట, ఫిబ్రవరి 15: ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు బకాయిలను వెంటనే చెల్లించాలని జేఏసీ మండల చైర్మన్ మోటూరి రామారావు డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దారు కార్యాలయం వద్ద జేఏసీ సభ్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి ధర్నా నిర్వహించారు. జేఏసీ సహ చైర్మన్ వై.సత్తిరాజు, కన్వీనర్ నల్లా వెంకటరామారావు, వైస్ చైర్మన్ కేపీసీ హెచ్ సూర్యారావు, ఆచంట రామచంద్రప్రసాద్, ఏవీ సుబ్బారావు, వి.విజయకృష్ణ, జి.రామ్‌కుమార్, బి.శేషగిరిరావు, వై.మురళి పాల్గొన్నారు.

ఎన్నికల అధికారులతో తహసీల్దారు సమీక్ష

ఆత్రేయపురం, ఫిబ్రవరి 15: రానున్న సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దారు ఎం.వెంకటరామయ్య కోరారు. గురువారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో బీఎల్‌వోలు, సెక్టారు అధికారులతో సమీక్షించారు. గ్రామాల్లో డబుల్ ఎంట్రీ, మరణించిన వారి ఓట్లను తొలగించాలని ఆదేశించారు. ఎస్ఐ శ్రీనివాసులు, ఆర్ఐ భవాని, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీపాద ఎస్.పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం సూర్య నమస్కారాలు,యోగా శిక్షణ ఇచ్చారు. శ్రీరామ్‌నగర్‌లోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పురపాలక సంఘప్రాథమిక పాఠశాలలో యోగా ఉపాధ్యాయురాలు దువ్వూరి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. క్లబ్ కార్యదర్శి యర్రమిల్లి అనంతలక్ష్మి, కోశాధికారి కె.విజయలక్ష్మి, పుత్సా రాజేశ్వరి, శ్రీగిరి పద్మావతి, భమిడిపాటి కనకాద్రి శాస్త్రి, పుత్సా కృష్ణకామేశ్వర్, జ్యోతి, దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందజేశారు.

కేన్సర్‌పై అవగాహన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 15: ప్రపంచ పిల్లల కేన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్య నిపుణుడు డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నంధ్యాల మనువిహార్, సప్పా నాగేశ్వరరావు, వలవల వెంకటరెడ్డినాయుడు, పచ్చిగోళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో సైన్సు ఫెయిర్

అంబాజీట, ఫిబ్రవరి15: ఇరుసుమండ సెయింట్ జోసెఫ్ ఇంగ్లీస్ మీడియం పాఠశాలలో గురువారం సైన్సు ఫెయిర్‌ను నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలు ఈ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. విద్యార్థుల్లో ఉన్న సృతజనాత్మకతను వెలికితీసేందుకు సైన్సు ప్రదర్శన ఉపయోగపడుతుందన్నారు. సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొని 150 వరకూ ప్రాజెక్టులను తయారు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అక్కిశెట్టి నాగవేణి, పాఠశాల సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

దళిత సంక్షేమ సేన నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రసాద్

రామచంద్రపురం, ఫిబ్రవరి 15: రామచంద్రపురం నియోజకవర్గ దళిత సంక్షేమ సేన అధ్యక్షుడిగా మద్దా ప్రసాద్‌ను నియమించినట్లు రాష్ట్ర దళిత సంక్షేమ సేన అధ్యక్షుడు పిట్లా జానకి రామారావు తెలిపారు. కార్యక్రమంలో జనసేపార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శులు బుంగా రాజు, మద్దా చంటిబాబు పాల్గొన్నారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

మలికిపురం, ఫిబ్రవరి 15: నేడు తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఐ రాజోలు నియోజకవర్గ కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ కోరారు. మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీగా బయలుదేరతామని, జిల్లా సీపీఐ పార్టీ ఇన్‌చార్జి కామ్రేడ్ డేగ ప్రభాకర్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

ప్యాడ్కో రుణం మంజూరు చేయాలి

యానాం, ఫిబ్రవరి 15: పుదుచ్చేరి వినాయక రీసెర్చ్ ఫౌండేషన్‌లో చదువుతున్న పదిమంది ఎస్సీ విద్యార్థులకు ప్యాడ్కో విద్యారుణం మంజూరు కాలేదని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. రుణంకోసం వినతి పత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో విద్యార్థులకు పరీక్ష హాల్‌టికెట్లు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని వారు అధికారులను కోరారు.

'వాహనదారులు మార్గదర్శకాలను పాటించాలి'



వాహనదారులు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా రవాణాధికారి అశోక్‌ప్రతాప్

ముమ్మిడివరం, ఫిబ్రవరి 15: వాహనాలు నడిపే ఆటో డ్రైవర్లు ఖచ్చితంగా రవాణాశాఖ జారీచేసే మార్గదర్శకాలను పాటించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చేందుకు తమ వంతు సామాజిక బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా రవాణాధికారి అశోక్‌ప్రతాప్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల్లో భాగంగా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు, కళాశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతా విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అమలాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కాశి, సిబ్బంది పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజన పథక కార్మికులను ఆదుకోవాలి'

మామిడికుదురు, ఫిబ్రవరి 15: మధ్యాహ్న భోజన పథక కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కార్మిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డపల్లి నాగేశ్వరరావు డిమాండు చేసారు. మామిడికుదురులోని నూకాలమ్మ ఆలయం వద్ద శుక్రవారం కార్మికుల సమావేశం జరిగింది. సమావేశంలో బొడ్డపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ భోజన పథకంలో పనిచేసే కార్మికులకు నెలకు రూ.15వేలు వేతనం ఇవ్వాలని, ప్రావిడెంట్ ఫండ్, ప్రమాద బీమా ఏర్పాటుచేసి గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండు చేసారు. ఆయా సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రికి పంపించినట్టు తెలియచేసారు. సమావేశంలో నీలం ధనలక్ష్మి, చెల్లుబోయిన నాగలక్ష్మి, చింతా కృష్ణవేణి, ఆకుల వెంకటలక్ష్మి, మొల్లేటి పార్వతి తదితరులను ఎన్నుకున్నారు.

ఇండస్ట్రియల్ వెల్డింగ్ శిక్షణా తరగతులు

మామిడికుదురు, ఫిబ్రవరి 15: మామిడికుదురులోని గెయిల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్‌లో ఇండస్ట్రియల్ వెల్డింగ్ జనరల్ డ్యూటీ నర్సింగ్ కోర్సులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి ఎ.సురేష్ కోరారు. రెండో బ్యాచ్‌కుగాను అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వెల్డింగ్ కోర్సుకు పదో తరగతి, ఇంటర్, డిప్లమో పాసైన, ఫెయిల్ అయిన వారు అర్హులని, నర్సింగ్ కోర్సుకు పదో తరగతి పాసై 18 నుంచి 27 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. శిక్షణా సమయంలో ఉచిత భోజనం, స్టైఫండ్ ఇచ్చి అనంతరం ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. వివరాలకు 8897999099లో సంప్రదించాలని కోరారు.

కంటి ఆపరేషన్‌కు వసుధ ఫౌండేషన్ ఆర్థికసాయం

అంతర్వేది, ఫిబ్రవరి 15: సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామానికి చెందిన సాగిరెడ్డి విశాక్‌భాస్కర్‌ఇందీవర్ కంటి ఆపరేషన్ కోసం వసుధ ఫౌండేషన్ అధినేత మంతెన వెంకట్రామరాజు రూ.30వేలు ఆర్థికసాయం అందించారని ఫౌండేషన్ ప్రతినిధులు జంపన బుజ్జిరాజు, బోనం రాజులు తెలిపారు. ఈ సాయాన్ని వారి చేతులమీదుగా బాబు తల్లికి అందించామన్నారు. కార్యక్రమంలో గిడుగు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

హజరత్ అబ్బాస్ జయంత్యోత్సవం

మామిడికుదురు, ఫిబ్రవరి 15: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ అబ్బాస్ జయంత్యోత్సవాన్ని మామిడికుదురు, నగరం, మొగలికుదురు గ్రామాల్లో గురువారం ఆనందోత్సాహాల మధ్య గురువారం జరుపుకున్నారు. ఇమామ్ హుస్సేన్ సేనాధిపతిగా హజరత్ అబ్బాస్‌కు ఇస్లాం చరిత్రలో ప్రత్యేక స్థానం ఉంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలోని మంజిలే కర్బలా, మామిడికుదురులోని హజరత్ అబ్బాస్ పంజాలో మిలాద్‌లు జరిగాయి. పలువురు ఉర్దూ కవులు ఈ మిలాద్‌లో పాల్గొని తమ కవిత్వాల ద్వారా హజరత్ అబ్బాస్ వీరత్వాన్ని కొనియాడారు.

ఘనంగా స్వామివారి విగ్రహ శంకుస్థాపన

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 15 : మండలంలోని మాచరలో గురువారం శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ శంకుస్థాపన ఘనంగా జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించారు. గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'వెంకట్రాజు మృతి తీరని లోటు'

అంతర్వేది, ఫిబ్రవరి 15: సఖినేటిపల్లిలంక ఎంపీటీ రుద్రరాజు వెంకట్రాజు మృతి తీరనిలోటని టీడీపీ నాయకుడు గంటి హరీష్ మాధుర్ అన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, ఎంపీపీ కేతా శ్రీను, సఖినేటిపల్లి మండల టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



లంక ఎంపీటీసీ రుద్రరాజు వెంకట్రాజు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న గంటి హరీష్‌మాధుర్

వీరభద్రరావుకు సన్మానం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 15: జనసేన పార్టీ ఎన్నికల కార్యక్రమాల నిర్వహణకు నియమితులైన పార్టీ సీనియర్ నాయకుడు సానబోయిన వీరభద్రరావును ముమ్మిడివరం జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర పీఏసీ కమిటీ సభ్యుడు పితాని బాలకృష్ణ, నాయకులు సత్కరించి అభినందించారు. వీరభద్రరావును ఎన్నికల కార్యక్రమాల నిర్వహణకు గోదావరి జోన్ కమిటీలో నియమించారు. కార్యక్రమంలో జక్కంశెట్టి బాలకృష్ణ, దూడల స్వామి, పితాని రాజు, వంగా సీతారామ్, గాలిదేవర రాము, గుత్తుల శ్రీనివాస్‌లతో పాటు పలువురు జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.